*ఎప్పుడో పెళ్ళినాటిరాత్రి పసుపు బట్టల మాటున మాసుకొన్న ముఖాలేమో ఎదురుపడ్డా ఒకరినొకరు గుర్తుపట్టలేక పోయారు, అడిగి తెలుసుకొనే దాకా. అయినా కావాలి అనుకొంటే ఒకరు అడ్డలేరు. అక్కర్లేదనుకొంటే...!*

# నిమ్నోన్నతాలు

'మీనా'



**రాఘవరావు** ఆఫీసునుంచి వచ్చి రావటం తోనే, ఒక మూల బూట్లు విడిచి, వంకెకు కోటు తగిలించి, పడక కుర్చీలో నడుంవాల్చాడు. భార్య విశాలాక్షమ్మ ఫలాహారం తెచ్చి పెట్టింది, ఆయన్ని అక్కడే చూచి.

"అమ్మా యేదీ?" రావుగారు అడిగారు, ఫలహారం పళ్లెం ముందుకు లాక్కుంటూ. ఆ మాట వినగానే, విశాలాక్షమ్మ కళ్ళు పెద్దవి చేసింది; మూడు ముళ్ళూ పడ్డనాటినుంచి ముచ్చటకైనా మాట్లాడించి యెరుగడు, ఈ రోజు యేమిటీ విశేషం అని.

"ఏమిటే ఆలోచిస్తున్నావ్, అమ్మా యేదే

అంటే?" అడిగాడు ఫలహారం ఆరగిస్తూ.

"ఏమీ లేదండీ. అమ్మాయి డాబామీద ఉందేమో?" సందేహంగా అంది భర్త ముఖంలోని భావాలు చదవటానికి ప్రయత్నిస్తూ.

"ఆ కోటుజేబులో ఉత్తరం ఉంది తియ్యి" అన్నాడు రాఘవరావు. తీసి యిచ్చింది. ఆయన చదవటం ప్రారంభించాడు. ఉత్తరం చదువుతున్నంతసేపూ, భర్త ముఖంలోకి పరిశీలనగా చూడసాగింది విశాలాక్షమ్మ.

"అబ్బాయే వస్తాడా?అయితేపెద్దవాళ్లెవరూ రారన్న మాట!" ఉత్తరం చదవటం పూర్తి అయిన తరువాత అన్నది ఒక నిట్టూర్పువిడుస్తూ. రాఘవరావు ఫలహారం చేస్తూ మాట్లాడలేదు.

"ఎందుకయినా మంచిదని పది రోజులు ముందుగానే వ్రాశానన్నాడే,యేమిటో ఆమంచి?" మళ్లీ అడిగింది మామూలుగా.

ఫలహారం గొంతుకకు అడ్డు పడినట్లుంది. మంచినీళ్లు త్రాగుతూ త్వరగా సమాధానం యివ్వలేక పోయాడు. "ఆ!... ఏమన్నా ఉంటే జాగ్రత్త పెట్టమని"—త్రాగిన గ్లాసు క్రిందబెట్టి వెటకారంగా అన్నాడు. ఆ మాటకు మెదలకుండా ఊరుకుంది. ఆమె ముఖంపైన కనుపించిన భావాలు యేం చదివాడో యేమోగాని రాఘవరావు ఉన్నట్లుండి ఉగ్రుడై పోయాడు.

"ఇదుగో మళ్లీ చెబుతున్నా. దానికి చీర సారె పెట్టావో ఇంటిముఖం చూడను...ఆ" మళ్లీ హెచ్చరించాడు రాఘవరావు.

"అదేమిటండీ అలా అంటారు? లోకంలో మన ఒక్కరిముఖానే ప్రొద్దుపొడిచిందా చెప్పండి!" ఆలోచనపూర్వకంగానే అంది ఆవిడ.

"పొడవనీ! పొడవకపోనీ! అనుకున్న ప్రకారం అన్నీ యిచ్చేశామా, లేదా?... ఇక ఆ ముఖానికి చిల్లిగవ్వైనా ఇవ్వను!" ఖండితంగా చెప్పేశాడు. ఏదో అసంతృప్తి, కర్కశత్వం గూడుగట్టుకు పోయాయి ఆ గుండెలో.

"అలుపూ సలుపూ లేకుండా ఏమిటండీ ఆ మాటలు"—భర్తను సమాధానపెట్టజూచింది, విశాలాక్షమ్మ.

"షేర్ ముయ్! అతిగా వాగావంటే..." ఖాళీ పళ్లెం అవతల పారేసి విసురుకుంటూ బయటికి వెళ్లాడు.

"ఇదీ ఈయన వరస"—అంటూ ఆయన వెళుతూన్న దారికేసి ఒక్కక్షణం చూచి, గ్లాసు, పళ్లెం లోపలికి తీసుకొని వెళ్తూ, తలుపు ప్రక్కనే ఉన్న శారదను చూచింది.

"లైటన్నా వెయ్యకుండా ఈ చీకట్లో ఇక్కడేం చేస్తున్నావే?" అడిగింది కూతుర్ని.

"ఏమీ లేదమ్మా ఊరికే నుంచున్నానంతే"—కళ్లు తుడుచుకుంటూ అంది.

కూతురి వాలకం చూడగానే విశాలాక్షమ్మ కళ్లుగూడ చెమ్మగిల్లాయి. "సరేలే... ఇవి తీసికెళ్లి లోపలబెట్టు." శారదను లోపలికి పంపి లైటు వేసింది.

• • •

పక్క వాటాలో పంతులుగారి గడియారం టంగు టంగుమని తొమ్మిది కొట్టింది. రాఘవరావు భోజనంచేసి ప్రక్కమీద శరీరాన్ని పడేశాడు. చేసి చేసి వచ్చిన ప్రాణం గనుక చిటికెలో నిద్రగూడ బట్టింది. రోజూ పడక ద్యూటీ బంట్రోతు ఆ రోజు ఇంకా రాలేదు రాబోవడు. అర్జంటు టపాలు తెచ్చిన బంట్రోతు అయ్యగారిని కదిలిస్తే కస్సుమంటారని, ఇంట్లో యిచ్చి వెళ్లిపోయాడు. విశాలాక్షమ్మ ఇంకా వంట ఇంట్లోనే దేవుకుంటూంది. పెంపుడు కుక్క అయ్యగారి మంచం ప్రక్కనే మోకాళ్లమీద పడుకొని, ముంగాళ్లమీద ముట్టె పెట్టి దిక్కులు చూస్తున్నది.

ఆ రోజు అమావాస్య. వీధిదీపాలు వెలుగుతున్నా చీకటి దట్టంగా అలముకున్నది. ఆకాశంలో చుక్కలు ఎవరికోసమోకాగడాలు పట్టుకొని వెదుకుతున్నాయి. శారద బయట వరండాలో నిలబడి శూన్యాకాశంలోని వింత ప్రవృత్తులను పరికిస్తున్నది.


# ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## ఉగాది నవలల పోటీ

## రు 2,500 లు బహుమతులు

శోభకృతు సంవత్సరారంభసమయంలో కూడా నవలల పోటీ నిర్వహించాలని సంకల్పించాము. రచయితలకు, రచయిత్రులకు ఇతోధికమైన ప్రోత్సాహం ఇవ్వడానికి నిశ్చయించాము.

**శోభకృతు ఉగాది నవలల పోటీలో గెలుపొందే నవలలకు ఈ దిగువ పేర్కొన్న విధంగా బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము:**

మొదటి బహుమతి రు 1,500 లు
రెండవ బహుమతి రు 600 లు
మూడవ బహుమతి రు 400 లు

పోటీలో పాల్గొనే వారు పాటించవలసిన నిబంధనలు ఇవి :

1. రచన 250 అరఠావు కాగితాలకు మించరాదు.
2. సిరాతో, కాగితానికి ఒక ప్రక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. సాంఘిక, చారిత్రిక ఇతివృత్తం ఏదైనా ఎన్నుకొనవచ్చు.
5. అనువాదాలుకాక స్వీయ రచనలు మాత్రమే పోటీకి పంపాలి.
6. బహుమతిపొందని రచనలలో ప్రచురార్హమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
7. బహుమతి పొందని రచనలను, ప్రచురార్హం కాని రచనలను త్రిప్పి పంపగలము.
8. పోటీకి పంపే రచనలను 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, చిత్తూరు'కు పంపాలి.
9. కవరుమీద 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.

**ఉగాది నవలల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరితేది**

**1963 జనవరి 31**

రచయితలు ఈ అవకాశం వినియోగించుకొని, తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందజేయాలని అర్థిస్తున్నాము. —ఎడిటర్

# నిమ్నోన్నతాలు

గేటు అలికిడైన చప్పుడు వినిపించింది. "ఎవరు?"—అన్నది. అటువైపు చూచి కొంచెం ఉలిక్కి పడిందిగూడ.

"నేనే... రాఘవరావుగారి యిల్లు ఇదేనా?" మొగ గొంతుక వినిపించింది.


"అవునండి. నిద్రబోతున్నారు. మీరెవరు?" అడిగింది శారద. ఆ మాటకు కొంచెం కలుక్కు మంది మనస్సు ఆ వచ్చినతనికి. అయినా గేటు తెరచుకొని లోపలికి వస్తున్నాడు మౌనంగా.

"మీ రెవరండీ?" చిమ్మ చీకట్లో ఆకారం గుర్తు పట్టలేక అడిగింది.

"సుధాకర్" అన్నాడు యాంత్రికంగా.

ఆ మాటలు వినగానే ఉలిక్కిపడింది. వెంటనే లోనికి పరుగెత్తింది.

'ఈ అమ్మాయినేనా మూడు సంవత్సరాల



ఏకాంబరేశ్వరాలయ మండపం (కంచి) ఫోటో—పిల్కా వీరరాఘవస్వామి (కాకినాడ)

క్రితం పెళ్ళిచేసుకుంది? ఏమిటీ ప్రశ్న?' తనకు తానే నవ్వుకున్నాడు. సుధాకర్ బయట గుమ్మంలోనే నిలబడిపోయాడు.

ఇది మూడేళ్ల నాటి మాట. అదీ పెళ్లయిన నాటి రాత్రి, పసుపు గుడ్డలో మాటున ఆముఖాన్ని ఏం చూశాడో ఏమో అంతే. మళ్లీ ఇదే ఈ గడపలో అడుగు పెట్టడం. ఈ మధ్యకాలంలో—కాలచక్రం ఇనుప ఆకుల సందున ఇరుక్కుపోయి, గిజగిజ తన్నుకునే జీవితాలు, పెద్దవాళ్ల గుండెల్లో పేరుకుపోయిన కల్మషం, పంతాలు, ప్రతిజ్ఞలు, ఆ నల్ల బండల క్రింద నలిగి, తునిగిపోయిన అనురాగ లతలు, అంతటితో ఊరుకోక రూపులనే మార్చాయి. అంతేగాదు. మనఃఫలకాల మీద ముద్రలను గూడ చెరిపివేశాయి. అందుకనే ఒకర్నొకరు ఎదురుబడ్డా గుర్తుపట్టలేకపోయారు, అడిగి తెలుసుకున్నదాక.

అది మూడు వాటాలు కలిసిన ఒకే డాబా. వీధికి మొగదలగానే ఉంది. బయట వరండాలో కూర్చుని కబుర్లాడుకుంటున్నారు ప్రక్కవాటాలో వాళ్ళు. అప్పుడు తీరికయింది గాబోలు వారికి. రోడ్డుమీద పలచబడుతున్న జనసంచారం కేసి చూస్తూ నిలబడ్డాడు సుధాకర్. అతని రాకను గమనించినా పలకరించటానికి ఎవ్వరూ ప్రయత్నించలేదు. ఎంతసేపని నిలబడతాడు? రావటమే పొరపాటయిందనుకొన్నాడు. కాసేపు అటు ఇటు తారట్లాడాడు. ఏదో అలికిడయినట్లనిపించింది. గుమ్మంవైపు చూశాడు. ఎవరో నీళ్ళు పెట్టిపోతున్నారు. కాళ్ళు కడుక్కుని బయట గదిలో పడక కుర్చీఉంటే, దానిమీద పడుకున్నాడు.

బయట గదంతా నిశ్శబ్దం. అతనొక్కడే కూర్చున్నాడు. ఇంట్లో మాత్రం ఏమిటో గుసగుసలు. నిజంగా ఇక్కడే అతని మనస్సు మళ్లీ చివుక్కు మన్నది. ఎంత ప్రబల శత్రువయినా, ఇంటికివస్తే విధిగా పలకరిస్తారు. అదే ఇక్కడ జరగలేదు. మళ్లీ తిరిగి వెళ్లిపోదామా అనుకున్నాడు. ఆలోచిస్తున్నాడు, లేచి అటు ఇటు తిరుగుతూ. ఈ నాలుగు గడియలూ కళ్ళు మూసుకుంటే మళ్లీ ఈ గడప తొక్కే పనేముంది? తన పనిమీద తాను వచ్చాడు.

ఇల్లంతా కాసేపు నిశ్శబ్దం.

"వదినగారూ!" — ప్రక్కవాటాలోనుంచి పిలుపు.

"..."

"వదినగారేదో హడావిడిగా వున్నారే"—మళ్లీ అదే గొంతుక.

"ఏమీ లేదండీ. అల్లుడొచ్చాడంటేను, వడియాలు రెండు వేయిస్తున్నాను..."

"కూరలు యేం చేశారేమిటి?" మళ్లీ ప్రశ్నించిం దావిడ.

"ఆ! ఏవుందండీ చెయ్యటానికి? వేపుడొకటి చేద్దామా, అనుకుంటున్నా. కాకపోయినా, ఈ వేళప్పుడొస్తాడని యెవరికి తెలుసు? ప్రొద్దుట వస్తాడేమో ననుకున్నా వదినగారూ"—దీర్ఘం తీసింది.

"ఇంతకీ అబ్బాయేం చదువుకున్నాడమ్మా?" మొదలుపెట్టిందావిడ.

"ఏం చదువులేండి? నానాకాలపు చదువు. బి.ఎ. అదీ మొన్ననే తెలిసింది తప్పాడని. అంతటితో ఆవిడ ఊరుకోలేదు.

"ఇప్పుడేం ఉద్యోగం?" మళ్లీ కదిపింది.

"ఏదో చేస్తున్నాడు లెండి. అదీ ఒక ఉద్యోగమే నంటారా? సర్వే ఆఫీసులో పని. నెలలో 15 రోజులేగా తిండి. ఇదిగో అన్నపూర్ణమ్మ వదినగారూ! కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది. బి. ఎ. ప్యాసవుతాడు. మంచి ఉద్యోగం చేస్తాడు. ఉద్ధరిస్తాడు అనుకున్నాం. ఈ రోజుల్లో పాలయ్యే ఉద్యోగం దొరుకుతుందనుకున్నామా? అదలాఉంటే, దాని రాతని ఈయన మాత్రం ఊరుకున్నారా? ఇచ్చి చేసుకున్నప్పుడు భరించక తప్పుతుందా? ఎవరిజీవితాలు ఎలా వెళ్లాలో అలా వెళ్ళతాయి. దానికి మనం ఏం చేస్తాం? దానిరాత అది. ఇంట్లో పెట్టుకొని దాన్ని పంపరు, పలకరించరు. అల్లుడొస్తే తేలిగ్గా చూస్తారు. ఈసడించుకుంటారు. ఏమంటే ఏం లాభం? మధ్య నలిగి చస్తున్నానుకో తల్లీ!" క్షణంసేపు ఇద్దరి మధ్య నిశ్శబ్దం.

రవి నెత్తుకుని అక్కడికి వచ్చింది శారద. "చంపేస్తున్నాడే వీడు. ఎంత ఆడించినా చంకలో నిలవటంలేదు. గుక్కపెట్టిమరీ యేడుస్తున్నాడు" అంటూ తమ్ముణ్ణి అందించింది తల్లికి.

శారద రావటంతో వారిద్దరి సంభాషణ ఆగిపోయింది. మళ్లీ పని గొడవలో పడింది విశాలాక్షమ్మ.

"నీళ్ళు బాత్‌రూమ్‌లో పెట్టు. పొయ్యి యేమైందో చూచి వేమాస్తున్నా"—శారద కో పని పురమాయించి పొయ్యి ముందు కూర్చుంది, రవినిగూడ పక్కనే కూర్చో పెట్టుకుని. రవి యేడుపు మానలేదు. ఆడుకోమని ఏవో వస్తువులు ముందు పడేసినా లాభం లేకపోయింది. బిస్కెట్లున్నా తెద్దామని లోపలి గదిలోకి వెళ్లింది. రవి ఏడుస్తూ, అంబాడుతూ వెళ్ళి, పొయ్యిలో కర్రలు లాగాడు. ఒక్కసారి పెద్దగా కెవ్వుమన్నాడు చెయ్యి కాలి. విశాలాక్షమ్మ పరుగెత్తుకు వచ్చింది, వాడి యేడుపు విని. వచ్చి రావటంతో ఖచతంకు

లాగి కప్పెకొద్దీ రెండంటించింది; చెయ్యి ఎంత కాలిందో గూడా చూడలేదు.

"ఎందుకే వాణ్ణలా కొడతావ్?రా,బాబూ రా!" ఆవిడ చేతిలోనుంచి లాక్కుని అవతలకు తీసుకు వెళ్లింది శారద.

"అబ్బబ్బ! ఎముకలు కొరికివేస్తున్నారుఇంట్లో వాళ్లంతా. అడ్డమైన వాళ్లకు చెయ్యలేక చస్తున్నాను. దేవుడు ఎప్పుడు కన్ను తెరుస్తాడో ఏమో, అయినా నాబోటి పాపిష్టిదానికిమాత్రం పుణ్యమా?" విసుక్కుంటూ పొయ్యి మీద కూర కాస్త క్రింద పడేసింది.

సుధాకర్ ఈ గొడవంతా గమనిస్తూనే ఉన్నాడు. ఇలాంటప్పుడురావటంతప్పేననిపించింది. ముళ్లమీద కూర్చున్నట్లు బాధపడ్డాడు. ఆవిడ మాటలు మనస్సును గాయపర్చినా, గంభీరంగా కూర్చున్నాడు.

"ఎవరే,ఇప్పుడు వచ్చింది?"—ఇంత గందరగోళం అయిన తరువాత గాని మెలుకువ రాలేదు రాఘవరావుకు. తను వచ్చానంటే ఎలా ప్రవర్తిస్తాడో తెలుసుకోవాలని కుతూహలంగా ఎదురు చూస్తున్నాడు సుధాకర్. అత్తగారు ఏం సమాధానం ఇస్తుందోనని అంతకంటే ఆదుర్దాగా కూర్చున్నాడు.

"ఎవరా? మీకూతురు మొగుడు.తెలీదూ?" ఒక్క విసురు విసిరింది. సుధాకర్‌కు కొరడా చురక అంటించినట్లనిపించింది. ముఖం ఎర్రబడింది.

శక్తికి మించిన పెద్ద బండను లేవనెత్తడానికి ప్రయత్నించి, వాటిక్రింద చేతులు పెడితే, లేవకపోగా చేతులు నలిగిపోతాయని ఈ రోజు తాను తెలుసుకున్నాడు. తమకు పదవీ, హోదా ఉన్నవని, తన కవి లేవని ఇంత తేలికా? తనకు హృదయం ఉంది. అది లేనప్పుడు ఆ బండకు, మనిషికి తేడా ఏమిటి? అయినా తనదే తప్పేమో? అందరిలాగా ఆయన అంతస్తు, అధికారం, డబ్బు చూచి, ఆయన కూతురును చేసుకోవటం ఏమిటి? అందువిదానికోసం అర్రులు చాస్తే ఇదే ప్రయోజనం చివరకు. ఒక వేడి నిట్టూర్పు అతని సంఘర్షణకు సమాధాన మిచ్చింది.

"స్నానానికి లేవవే మీ ఆయన్ని. స్నానంచేసి భోజనానికి లేస్తాడు"—ఆ మాటలు చెవుల్లో గింగురు మన్నాయి. అప్పుడుగాని ప్రపంచంలోకి రాలేకపోయాడు.

"స్నానానికి లేవండి." టవ లక్కడపెట్టి వెళ్ళిపోయింది శారద. స్నానమటుకు చేసి భోజనం మానేద్దామనుకున్నాడు. ఇప్పటి కయిందానికి కడుపు నిండేఉంది.

"అక్కర్లేదండీ" అన్నాడు సుధాకర్.

"బలేవాడివే నాయనా! అత్తగారింటికెళితే అన్నమన్నా తినమన్లేదని ఆడిపోసుకుంటానికా? లే నాయనా లే" అన్నది విశాలాక్షమ్మ.

ఆ మాటలు వింటూంటే కుంచించుకుపోయాడు. ఛ! అనుకున్నాడు. 'హృదయంలేని మనుష్యులు.' మనసులో అనుకొని,నొసలు చిట్లించుకుంటూ లేచి, స్నానం చేసి, విస్తరి ముందు కూర్చొని, ఏదో అయిందనిపించాడు. వచ్చేవరకే వరండాలో ప్రక్క వేశారు. బరువుగా ఉన్న దేహాన్ని పడేశాడు పక్కమీద. సుధాకర్ హృదయంలో అగ్నిపర్వతాలు బ్రద్దలౌతున్నా పైకి మాట్లాడలేదు ఇంతవరకు. లోలోపలే బాధ పడుతున్నాడు. అంతే. అమ్మాయి అంతగా నచ్చకపోయినా, ఏదో ఉద్యోగం ఇప్పిస్తాడు గదా అని ఆశపడ్డాడు. అది జరగక పైగా తేలిగ్గా చూశాడు. తను మోసం చేసినట్లు, తనవల్ల ఎంతో ఆశాభంగం పొందినట్లు ప్రవర్తించాడు. ఇక ఆ మాత్రం తనకు ఉద్యోగం రాదా! తన బ్రతుకు తాను బ్రతకలేడా? అభిమానం త్రాచుపాములా బుసలు కొట్టింది. మూడుసంవత్సరాలు ఈ గడప త్రొక్కలేదు.ఈనాడు త్రొక్కదలుచుకోలేదు.....కాని తాను కట్టిన మాంగల్యం? ఈ పంతాలమధ్య, అగాధాలమధ్య, తను కట్టిన మంగళసూత్రం ఒక అమాయకురాలి హృదయానికి గళసూత్రం కాగూడదు. అదే తన బాధ. అదే తన సమస్య. వాళ్ళకు వయస్సుతోపాటు బుద్ధి మాంద్యం, మూర్ఖత్వం సమపాళ్ళతో పెరుగుతున్నాయి. బరువుగా బలవంతంగా కళ్ళు మూసుకున్నాడు.

* * *

సుధాకర్ నిద్ర లేచేటప్పటికి ఎనిమిది గంటలు దాటింది. అప్పటికే ఇంటి యజమాని కాఫీ సేవించి బయటికి వెళ్ళిపోయాడు. కాలకృత్యాలు తీర్చుకొని, స్నానంచేసి వచ్చేసరికి కాఫీ టేబుల్‌మీద పెట్టిఉన్నది.

"పది గంటల బండికి ప్రయాణమండీ"—భార్యవైపు చూస్తూ అత్తగారితో అన్నాడు, కాఫీ కప్పు నోటిదగ్గర పెట్టుకుంటూ.

"అప్పుడే ప్రయాణమా? ఒక్కసారి చెబితే ఎలా నాయనా?" బియ్యం చేసుకుంటూకూర్చున్న విశాలాక్షమ్మ అల్లుడివైపు చూస్తూ అన్నది.

"అలా అంటారనే పది రోజులు ముందుగానే ఉత్తరం రాశాను."

"రాశావులే. అమావాస్య, మంగళవారం. అందులో నిన్ననే బయటి స్నానం—మంచీ చెడూ ఉండక్కర్లా?" స్థాయి పెంచింది ఆవిడ.

సుధాకర్ మౌనం దాల్చాడు.

"దేవు డిచ్చిన రోజులకు మంచీ, చెడూ ఉందా?"—శారద మాటలు గడ్డ కట్టుకున్న మంచు సూర్యుని కాంతికి కరిగి ప్రవహించినట్లు ప్రవహించాయి. సుధాకర్ శారదవైపు చూసి ఏదో అనబోయాడు.

"మీరుండండి.మీకేం తెలీదు"—తల్లివైపు తిరిగి, "మంచీ, చెడూ తెలిసినదానివిగా, రాత్రి నుంచి నీ ప్రవర్తన ఇలా ఉంది? మర్యాదలేని మనుష్యులు మీరు. పైగా కంచం చెంబు ఇస్తే సహించనన్నాడు నాన్న. అదేనా ఆయన అనవలసింది?పదండి వెళ్ళిపోదాం" అన్నది. శారద గొంతులో ఉద్రేకం సుధాకర్‌ను ఆశ్చర్యపరచింది. ఇంతకుముందే సర్దుకున్న పెట్టె తీసికొని దారి చూపింది శారద.

ఉన్నట్టుండి ఇలా కూతురు విరుచుకు పడేటప్పటికి ఒక్క విశాలాక్షమ్మగారే గాదు, ప్రక్కవాటాలోని అన్నపూర్ణమ్మగారు గూడ విస్తుపోయారు.

"శారదా!" పిలిచింది విశాలాక్షమ్మ.

"తల్లిదండ్రీ అని ఇంతవరకు గౌరవించాను. తప్పయిపోయింది. ఆయన రాకరాక రాత్రి వచ్చినా, మీ ప్రవర్తన ఎంత అసహ్యంగా ఉందో తలుచుకుంటే మీకే తెలుస్తుంది. నాకే సిగ్గవుతున్నది. ఎన్నడూ లేనిది నాన్న తెల్లవారేసరికి వెళ్ళిపోయారు మా ముఖం చూడవలసి వస్తుందని. అంత పాపం చేశామా మేము!" శారద కళ్ళల్లో ఎర్రజీరలు తేలాయి. ఉద్రేకంతో, ఉద్వేగంతో వణక సాగింది.



ప్రకృతి విలాసం
(మహాబలిపురం)
ఫోటో— 'భరద్వాజ' (మద్రాసు-18)

"శారదా! పోతున్నావా? అన్నీ ఉండి లేనిదానివయ్యావు." విశాలాక్షమ్మ కళ్ళల్లో నీళ్ళు నిండాయి. పైటకొంగు నోట్లో పెట్టుకుంది.

"ఎందుకమ్మా అలా ఏడుస్తావ్? ఎప్పటికైనా అక్కడికి వెళ్ళక తప్పుతుందా?" పెట్టె తీసుకొని బయలుదేరింది. ఎదురుగా వస్తున్న రిక్షాను ఆపాడు సుధాకర్. రిక్షావాడు పెట్టె తీసికున్నాడు. ఇద్దరు రిక్షాలో కూర్చున్నారు పెట్టెమీద కాళ్ళు పెట్టుకొని.

కృతజ్ఞతతో నిండిన కళ్ళతో శారదవైపు చూస్తూ, "ఎంత పని చేశావు శారదా? మీ అంతస్తుకు నే నెక్కలేకపోయినా, నా అంతస్తుకు నీవే దిగివచ్చావు" అన్నాడు సుధాకర్. ★